సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ; 14 ; జూన్ ; 2024



రక్తదాత సుఖీభవ

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం. రక్తదానంపై అవగాహన అత్యవసరం.

- 8లో



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి..

రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. మెళియాపుట్టి మండలంలో ఘటన జరిగింది.

- 8లో

అధిక ఓల్టేజ్‌తో పాడైన విద్యుత్ గృహోపకరణాలు

ఇచ్ఛాపురం: అధిక ఓల్టేజ్ కారణంతో గృహోపకరాలు పాడయ్యాయి. గురువారం మున్సిపాలిటీ పరిధి 15వ వార్డు జర్నలిస్ట్ కాలనీలో సంభవించిన అధిక ఓల్టేజ్ కారణంగా 3 ఫ్రిడ్జ్‌లు, 15 సీలింగ్ ఫ్యాన్లు, రెండు ఇన్వర్టర్లు, లైట్లు కాలిపోయాయి. కాలనీలో సరైన విద్యుత్ లైన్లు లేకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయని, విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులందరికీ పుస్తకాలు చేరాలి




పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

రణస్థలం: ప్రభుత్వం అందించే నోటు పుస్తకాలు, పాఠ్యాంశాలు ప్రతి విద్యార్థికి చేరాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జేఆర్ పురం హైస్కూల్‌ను, విద్యార్థుల పుస్తకాల కిట్స్ నిల్వ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా భోజనం సిద్ధం చేయాలని, నాణ్యతతో పాటు, రుచిగా వండాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడు తూ క్రమశిక్షణతో చదువుకుని విద్యా రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, హెచ్‌ఎం బి.రమణయ్య, సీఆర్‌పీలు ఉన్నారు.

ఆదిత్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు సరెండర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తు న్న జీఏవీఎల్ఎన్ కృష్ణమాచార్యులును తన మాతృశాఖ ఆలయమైన విశాఖపట్నం కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయంలో ఉద్యోగాలు వేస్తా మంటూ కొందరి వద్ద ఈ కృష్ణమాచార్యులు డబ్బులు వసూలు చేసినట్లుగా ఆరోపిస్తూ.. బి.సూర్యనారాయణ అనే స్థానికుడితో పాటు పలువురు భక్తులు లిఖితపూర్వకంగా కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారని, దీనిపై కమిషనర్ ఆదేశాల ప్రాప్తికి విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ సుజాత ఈ మేరకు సరెండర్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని ఆయ న వివరించారు. ఈ ఆరోపణలపై డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలోనే విచారణను త్వరలోనే చేపట్టనున్నారని, ఈ క్రమంలో అత్యవసరంగా కృష్ణమాచార్యులను సరెండర్ చేశామని వివరించారు. ఆలయంలో ఇటీవల కొంతకా లంగా జరుగుతున్న సిబ్బంది అంతర్యుద్ధాలపై ఈఓ చంద్రశేఖర్ స్పందిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తే ఎవ్వరినీ క్షమించేది లేదని తెలియజేశారు. అలాగే ఆలయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, ఫేక్ ఆర్డర్లతో ఉద్యోగాలు చేస్తున్న వ్యవహారాలు తన దృష్టికి రాలేదని, ఉంటే విచారణ చేసి చర్యలు చేపడతామన్నారు. అలాగే దేవదాయ శాఖలో ఎలాంటి ఉద్యోగాల నియామకాలైనా, ఆర్డర్లు ఇవ్వాలంటే నేరుగా శాఖ రాష్ట్ర కమిషనర్‌కు మాత్రమే అధికారం ఉందని పునరుద్ఘాటించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ సప్లిమెంటరీ ఆరో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 నుంచి ఐదు గంటల వరకు 11 పరీక్ష కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల 27వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 2400 మంది పరీక్షలు రాస్తున్నారు. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

'తూర్పు కాపులకు మంత్రి పదవి కేటాయించాలి'

శ్రీకాకుళం: జిల్లా తూర్పు కాపులకు పుట్టినిల్లు వంటిదని, ఈ జిల్లాలో సుమారు ఏడులక్షల మంది తూర్పుకాపులు ఉన్నారని, ఈ సామాజిక వర్గానికి మంత్రి పదవి కేటాయించాలని తూర్పు కాపు సామాజిక వర్గ అధ్యయన వేదిక ప్రతినిధులు శాసనపు జోగినాయుడు, వాన కృష్ణచంద్, లోలుగు వెంకట రాజశేఖర్, కొమ్ము రమణమూర్తి తదితరులు డిమాండ్ చేశారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు తూర్పు కాపు సామాజిక వర్గానికి ఎంతో గుర్తింపు ఇస్తున్నాయని, అనేక పదవులు కేటాయిస్తున్నారని, అదే తరహాలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా కేటాయించాలన్నారు. జిల్లాలో కూటమి అధికారంలోకి రావటానికి తూర్పు కాపులు ఎంతో కృషి చేశా రని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని సీనియర్ నేతలు, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన గొర్లె శ్రీరాములునాయుడు, లుకలాపు లక్ష్మణదాస్, డోల సీతారాంనాయుడు, పాలవలస సంగం నాయుడు నుంచి ఈ ఆనవాయి తీ కొనసాగుతోందని తెలిపారు. తాజా ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్తరాంధ్ర జిల్లాల నేత కిమిడి కళావెంకట్రావు, మామిడి గోవిందరావులకు తగిన గుర్తింపు ఇవ్వాలని, లేకుంటే కాపుల ఆగ్రహానికి టీడీపీ గురికావడం ఖాయమని వారు హెచ్చరించారు.



శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రార్థన

శ్రీకాకుళంలో సైకిల్‌పై స్కూల్‌కు వస్తున్న విద్యార్థి

శ్రీకాకుళంలో తన కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్తున్న తల్లి

బడి గంట.. మోగెనంట..

రెండు నెలలు తెల్లబోయిన నల్లబల్ల ముఖంపై చిరునవ్వు విచ్చుకుంది. వేసంగుల్లో మౌన ధ్యానం చేసిన బడి గంట గుండె ఝంగున మోగింది. ఇన్నాళ్లూ పిల్లలు లేక నిశ్శబ్దమైపోయిన తరగతి గది వేసవి ముచ్చట్లను ఆరారా విన్నది. బడి ముందు చిరుతిళ్ల దుకాణాలకు కొత్త జీవం వచ్చింది. పాఠశాల లోపల మైదానాలకు కొంగొత్త సత్తువ అందింది. వేసవి అనంతరం బడుల పునఃప్రారంభంతో విద్యా సంవత్సరం ఉత్సాహంగా ప్రారంభమైంది. కానీ స్కూల్ కిట్లు అందలేదనే నిరాశ అందరిలోనూ కనిపించింది.



శ్రీకాకుళంలో పాఠశాలకు చేర్చిన తండ్రికి టాటా చెబుతున్న పిల్లలు

- తెరుచుకున్న బడులు
- ప్రైవేటుతో సహా అన్ని పాఠశాలలు పునఃప్రారంభం
- సర్కారీ పాఠశాలల్లో కానరాని స్టూడెంట్ కిట్స్ పంపిణీ
- బడులకు వచ్చి నిరాశగా వెనుదిరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

వేసవి సెలవుల అనంతరం బడి తలుపులు తెరుచుకున్నాయి. ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు పూర్తిస్థాయిలో పునఃప్రారంభమయ్యాయి. గత ఏడాది వరకు ఠంఛనుగా బడి తెరిచిన రోజే అన్ని వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక పంపిణీతో ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం నెలకొని ఉండేది. కానీ ఈ ఏడాది మాత్రం ఎక్కడా అలాంటి వాతావరణం కనిపించలేదు.



శ్రీకాకుళంలో సెలవులు అనంతరం తమ ఫ్రెండ్స్‌ని కలిసిన ఆనందంలో..

కానరాని కిట్ల పంపిణీ..

జగనన్న విద్యాకానుకను స్టూడెంట్ కిట్స్ అని పేరు మార్పు చేసినప్పటికీ పంపిణీ చేసే ప్రక్రియ పెద్దగా కానరాలేదు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వచ్చిన స్కూల్‌బ్యాగ్, నోట్‌పుస్తకాలు మాత్రమే అక్కడక్కడా అందజేశారు. పాఠ్యపుస్తకాలు ఇంకా పాఠశాలలకు పూర్తిస్థాయిలో చేరలేదు. ఈనెల 20వ తేదీ తర్వాత పూర్తిస్థాయిలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఈ విషయం తెలియని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు బడి తెరిచిన రోజే ఎంతో ఆశగా వచ్చి.. నిరాశతో వెనుదిరిగారు. కాగా ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే అడ్మిషన్ల పర్వం మొదలవగా.. తాజాగా ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. బడుల్లో చేరిన ఒకటి, ఆరు తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎంలు సమావేశాలు నిర్వహించారు.

తొలి రోజు 63.75 శాతం హాజరు..

వేసవి సెలవుల తాపం నుంచి విద్యార్థులు ఇంకా బయటపడలేనట్టుగా ఉంది. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు 3055 ఉండగా వీటిల్లో తొలిరోజు 63.75 శాతం మంది విద్యార్థులు బడులకు హాజరయ్యారు. డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. జిల్లా వ్యాప్తంగా 2,57,274 మంది విద్యార్థులు చదువుతుండగా.. మొదటి రోజు 2,09,279 మంది హాజరు మాత్రమే తీసుకున్నారు. తొలిరోజు 1,32,949 మంది రాగా 76330 మంది గైర్హాజయ్యారు. హాస్టల్ విద్యార్థులు ఇంకా రావాల్సి ఉంది.



క్లాస్ రూమ్ లో తరగతులు

కాళింగులపై కక్ష ▸ పదవుల్లో వివక్ష

- రాష్ట్రంలో లక్షలాది జనాభా గల సామాజిక వర్గంపై చిన్న చూపేమిటి?
- కాళింగులను గౌరవించిన వైఎస్సార్‌సీపీ
- అధికారంలోకి వచ్చాక అన్యాయం చేసిన టీడీపీ
- శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా కాళింగ సామాజిక వర్గంలో ఇదే చర్చ
- మంత్రి పదవి ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తున్న సామాజిక వర్గ పెద్దలు
- ఒకే కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవులిచ్చి.. తమను అవమానపరిచారని ఆవేదన



సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం :

2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కాళింగ సామాజిక వర్గానికి మూడు చోట్ల ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించింది. కానీ, ఎన్నికల్లో ఒకరే విజయం సాధించారు. ఆ ఒక్కరైన తమ్మినేని సీతారాంకు శాసనసభలో కీలకమైన, రాష్ట్రంలో అత్యున్నతమైన స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించింది. ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన దువ్వాడ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. ఇచ్ఛాపురంలో ఓడిపోయిన పిరియా సాయిరాజ్ భార్య విజయకు జెడ్పీ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చింది. టెక్కలి శాసనసభకు పోటీ చేసి ఓటమి పాలైన పేరాడ తిలక్‌కు రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చింది. జిల్లాలో ప్రధానమైన వెలమ సామాజిక వర్గంతో సమానంగా పదవుల విషయంలో ప్రాధాన్యత ఇచ్చింది.

అదే వైఎస్సార్ సీపీ తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా, మూడు చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని కాళింగ సామాజిక వర్గానికి కల్పించింది. కానీ, పోటీ చేసిన నలుగురిలో ఒక్కరు కూడా గెలవలేదు.

ఇదే ఎన్నికల్లో టీడీపీ విషయానికొస్తే శాసనసభకు పోటీ చేసే అవకాశం ఇద్దరికి మాత్రమే కల్పించింది. ఆ ఇద్దరూ విజయం సాధించారు. కానీ, వీరి లో ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వలేదు. చివరి నిమిషంలో మిగిలిపోయిన చిన్నా చితక పోస్టులిచ్చి, చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీ కనిపించడం లేదు.

జిల్లాలో కాళింగ సామాజిక వర్గంలో జరుగుతున్న చర్చ ఇదీ.

2014లో కూడా ఇదే పరిస్థితి. వైఎస్సార్‌సీపీ పార్టీ కల్పించిన ప్రాధాన్యత టీడీపీ ఇవ్వడం లేదు. ఎందుకనో కాళింగ సామాజిక వర్గాన్ని విస్మరించి చిన్న చూపు చూస్తోంది. గత మూడు పర్యాయాలుగా జరిగిన ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలపై ఇప్పుడా సామాజిక వర్గ మేధావులు, పెద్దలు, నాయకులు, ప్రజలు అంతర్మథనం చెందుతున్నారు. టీడీపీని గెలిపిస్తే మనకిచ్చే బహుమానం ఇదా? అని మండిపడుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికీ అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ మంత్రి పదవులిచ్చి తమకు అన్యాయం చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. కాళింగుల మనోభావాలను, మొరను వినకుండా మంత్రి వర్గంలో తమను విస్మరించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న కాళింగులను అవమాన పరిచారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కాళింగ సామాజిక వర్గం సంఘం ప్రతినిధులు ప్రెస్‌మీట్ పెట్టి తమ ఆవేదన, అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎవరికి ఎన్ని పదవులు ఇచ్చినా తమ సామాజిక వర్గానికి కూడా పదవిని కేటాయిస్తే బాగుండేదనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

ఎందుకంత కక్ష

జిల్లాలో ప్రధాన సామాజిక వర్గంలో ఒకటి కాళింగ సామాజిక వర్గం. జిల్లా వ్యాప్తంగా వీరి ప్రభావం ఉంది. తూర్పు కాపు, వెలమ సామాజిక వర్గాలతో సమానంగా కాళింగులుంటారని ఆ వర్గ పెద్దలు చెబుతుంటారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే కాదు విశాఖపట్నం, విజయనగరం, గోదావరి జిల్లాల్లో కూడా భారీ సంఖ్యలో ఉన్నారు. ఇక, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా ఉద్యోగ, ఉపాధి కోసం వలస వెళ్లి ఎన్నికల సమయంలో ఓటేసేందుకు వచ్చిన వారు ఉన్నారు. ఇంతమందిని ఎన్నికల్లో ఉపయోగించుకుని తీరా పదవులకు వచ్చేసరికి అవమాన పరచడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఎన్నికల్లో వారేమీ చేయలేరు, చెప్పినట్టుగా తమకే ఓటేస్తారు, వారికి అంతకుమించి ఆప్షన్ లేదు, కీలక పదవులు ఇవ్వకపోయినా ఏం చేయలేరు.. అన్నట్టుగా టీడీపీ వ్యవహరిస్తోందని ఇప్పుడా సామాజిక వర్గీయులంతా మదనపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నంతకాలం కావాలి.. అధికారంలోకి వచ్చేసరికి తాము అక్కర్లేదా? తమపై ఎందుకింత కక్ష అని కాళింగ సామాజిక వర్గ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాధాన్యత లేని పోస్టులెందుకు



రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10లక్షలకు పైగా జనాభా ఉన్న తమకు మంత్రి వర్గంలో చోటు కల్పించలేదని, ఇంకా మిగిలి ఉన్నవి ఒక మంత్రి పదవి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్ పదవులేనని, వాటిలో మంత్రి పదవి ఎలాగూ వచ్చే పరిస్థితి లేదని, స్పీకర్ పోస్టు ఇచ్చే పరిస్థితి అంతకన్నా లేదని, మిగిలిపోయిన డిప్యూటీ స్పీకరో, చీఫ్ విప్, విప్ పోస్టు ఇస్తే ఏం లాభమని అంటున్నారు. కీలక పదవుల్లో విస్మరించి ద్వితీయ శ్రేణి పదవులిస్తే తాము సంతృప్తి పడే పరిస్థితి లేదని, తమకంటూ ఒకరోజు వస్తుందని వార్నింగ్ ఇస్తున్నారు. కాకపోతే, ఇప్పుడా వార్నింగ్‌లకు బెదిరిపోయే పరిస్థితిలో చంద్రబాబు లేరు. పూర్తి మెజారిటీ ఉండటంతో ఇప్పటికప్పుడు ఆ పార్టీకి ఒరిగేమి లేదు. అంత ఐక్యతే ఉంటే కాళింగులకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ అభ్యర్థులనే గెలిపించుకునే వారమని, తమలో ఉన్న, అనైక్యత, చీలిక వల్లనే సామాజిక వర్గానికి ఈ పరిస్థితి వచ్చిందని, జిల్లాలో ప్రధాన సామాజిక వర్గమైనప్పటికీ టీడీపీ అధిష్టానం విస్మరించిందని ఆ సామాజిక వర్గంలోని మరి కొంతమంది మనసులో మాటను తెలియజేస్తున్నారు. ఏదేమైనప్పటికీ రాష్ట్ర మంత్రి వర్గంలో కాళింగ సామాజిక వర్గానికి తీరని అన్యాయమే జరిగింది. చెప్పాలంటే నమ్మి ఓట్లేసిన పార్టీ మోసం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆ వర్గం అభిప్రాయపడుతోంది.

'కాళింగులకు మంత్రి పదవి ఇచ్చి న్యాయం చేయాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతు కృష్ణారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో 14 లక్షలకు పైగా జనాభా ఉన్న కాళింగ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించి సీఎం నారా చంద్రబాబునాయుడు న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా కళింగసీమ సేవా సమితి అధ్యక్షులు హనుమంతు కృష్ణారావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పేడాడ జనార్ధనరావులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరం అఫీషియల్ కాలనీలో ఉన్న హనుమంతు కృష్ణారావు నివాసంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. కాళింగులంటే కేవలం శ్రీకాకుళం జిల్లాకే పరిమితం కాదని, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ఉన్నారని పేర్కొన్నారు. ఒక్క విశాఖపట్నం నగరంలోనే లక్షకు పైగా జనాభా ఉన్నారని, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ సంఖ్య ఇంకా ఎక్కువని తెలిపారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కాళింగులకు రాష్ట్ర మంత్రి పదవి ఇచ్చారని, అదే సంప్రదాయాన్ని చంద్రబాబునాయుడు కొనసాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు కె.టి.నాయుడు, బి.సన్యాసిరావు, రామ్మోహన్, రమేష్, వెంకటరావు, ప్రసాద్, కిరణ్, సాంబమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీయూకేటీకి ఐక్యరాజ్య సమితి ప్రశంస



క్యాంపస్‌లో మొక్కలు నాటుతూ..

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. జూన్ 5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని తెలియజేయాలని ఐక్యరాజ్య సమితి కోరింది. ఈ మేరకు గో గ్రీన్ పేరిట పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, మొక్కలు నాటుతున్న ఫొటోలను సంస్థ అధికారులు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ మేరకు సంస్థ పనితీరును ప్రశంసిస్తూ గురువారం ఐక్యరాజ్య సమితి సందేశం పంపింది. బయోసైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి, ఇతర జాతీయ సేవాపథకం పీఓలను డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, ఏఓ మునిరామకృష్ణతో కూడిన అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో మొక్కలు నాటారు.

ఎర్రముక్కాంలో సినిమా సందడి



ఎర్రముక్కాం బీచ్‌లో మిరాజ్ చిత్రం షూటింగ్

సోంపేట: ఎర్రముక్కాం నేతాజీ బీచ్‌లో మిరాజ్ చిత్రం (తెలుగు–ఒడియా) షూటింగ్ జరుగుతోంది. సముద్ర గర్భంలో దాగిన నిధుల గురించి గురువారం సన్నివేశాలు చిత్రీకరించారు. సినిమా చిత్రీకరణ జరుగుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు షూటింగ్ వద్దకు భారీగా వచ్చారు. నిర్మాత కె.భాస్కర్, మన ఫిలిం చాంబర్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు కుమార్ నాయక్, రమేష్ యాదవ్ తదితరులు నటిస్తున్నారు. స్థానిక సర్పంచ్ బైపల్లి ఈశ్వరి, ఎంపీటీసీ పుక్కల కూర్మారావు, గ్రామస్తుల పాపారావు తదితరులు చిత్రీకరణలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిదండ్రుల చెంతకు ఇంటర్ విద్యార్థి



తల్లిదండ్రులకు ఉదయకుమార్‌ను అప్పగించిన పోలీసులు

నరసన్నపేట: మండలం రెడ్డికిపేట సమీపంలోని యాతపేటకు చెందిన ఇంటర్ విద్యార్థి ఉదయకుమార్ క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10న కాలేజీకి వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి బయటకు వచ్చిన ఉదయకుమార్ తర్వాత ఇంటికి చేరలేదు. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు పలు చోట్ల గాలించారు. ఫలితం లేక పోవడంతో నరసన్నపేట పోలీసులకు 11 తేదీన ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎంక్వరీ చేయడంతో విశాఖలో ఉన్నట్లు గుర్తించి ఇంటికి క్షేమంగా చేర్చారు. ఇంటర్ చదివేందుకు తనకు ఇష్టం లేని కళాశాల్లో తల్లిదండ్రులు జాయిన్ చేశారని బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఉదయ కుమార్ తెలిపారు.

రోగులతో కొత్తూరు సీహెచ్‌సీ కిటకిట



రోగులతో కిటికిటలాడుతున్న కొత్తూరు సీహెచ్‌సీ

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గురువారం రోగులతో కిటికిటలాడింది. కొత్తూరు, ఎన్ఎన్ కాలనీతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు డయేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్ ప్రత్యేక శ్రద్ధతో రోగులకు సకాలంలో వైద్యం అందిస్తున్నారు. భామిని, సీతంపేట మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన హడ్డుబంగి, కాశీనగర్‌లతో పాటు పలు గ్రామాలకు చెందిన రోగులు కొత్తూరు సీహెచ్‌సీకి వైద్యం కోసం రావడంతో ఆస్పత్రి రోగులతో మరింత రద్దీగా కనిపిస్తోంది.

వలస మత్స్యకారుడు మృతి



మృతుడు చిన్న (ఫైల్)

రణస్థలం: మండలంలోని అల్లివలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు యజ్జల చిన్న(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మత్స్యకారుడైన చిన్న ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ సమీపంలో అంగూల్ జిల్లాలో ఉయ్యాలలు, టోపీలు అమ్మడానికి వలస వెళ్లాడు. అక్కడ రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడని ఒడిశా పోలీసులు గ్రామానికి సమాచారం ఇచ్చినట్లు అల్లివలస సర్పంచ్ చీకటి యర్రయ్య తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది. ప్రమాదం ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం



పల్లకి మోస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని విశాఖ–బి కాలనీలో షిరిడిసాయి మందిరంలో గురువారం పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొంక్యాన మురళీ ఆధ్వర్యంలో పల్లకీలో షిరిడిసాయి చిత్రపటం ఉంచి ఊరేగింపు చేపట్టారు. ముందుగా స్వామివారికి మూడురకాల హారతులు ఇచ్చి నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రక్తదాత సుఖీభవ

- రక్తదానంతో ప్రాణదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
- ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు



ప్రపంచమంతా ఒకే మాట అంటోంది 'రక్తదాత సుఖీభవ' అని. లోకమంతా ముక్తకంఠంతో పలుకుతోంది 'రక్తదాతే ప్రాణదాత' అని. అవయవాలు కృత్రిమంగా తయారుచేస్తున్నారు, మానవ శరీరాల నుంచి అవయవాలను వేరు చేసి భద్రపరిచి వేరొకరికి అమరుస్తున్నారు. కానీ రక్తం మాత్రం ఏ ల్యాబొరేటరీ తయారు చేయలేదు. మనిషి దానం చేస్తే తప్ప రక్తం నిల్వ చేయడం కుదరదు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం. అపోహలు పోగొట్టుకుని, అవగాహన పెంచుకుని ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయగలిగితే ఆస్పత్రుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రాణాలు పోసినట్టే.

– శ్రీకాకుళం కల్చరల్/ఇచ్ఛాపురం రూరల్

ఎవరు రక్తదానం చేయవచ్చు..?



రక్తదానం చేయడానికి ఉండాల్సింది రెండే అర్హతలు. చక్కటి ఆరోగ్యం, మంచి మనసు. 19 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన స్త్రీ, పురుషులు ఎవరైనా 45 కేజీల బరువు పై బడి ఉన్నవారు, 12.5 ఎంజీ హిమోగ్లోబిన్ కలిగిన వారు, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేని వారు నిస్సంకోచంగా రక్తం దానం చేయవచ్చు.

ఎంత రక్తం సేకరిస్తారు?



ఒక మనిషి నుంచి కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం మాత్రమే సేకరిస్తారు. సాధారణంగా మనుషుల్లో 5 నుంచి 6లీటర్ల వరకు రక్తం ఉంటుంది. ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తే ఒక లీటరు వరకు రక్తం పోతుంది. అయినా మనిషికి ఏమీకాదు. దీన్ని తెలుసుకుంటే కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం దానం చేయడం వల్ల ఏమీ కాదని అర్థమవుతుంది.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

అత్యవసర సమయంలో రక్తం కావాలంటే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చే పేరు రెడ్‌క్రాస్. దశాబ్దాలుగా వీరు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తం నిల్వ చేసి ఆపన్నులకు అందిస్తున్నారు. 2006 మార్చి నెలలో జిల్లా కేంద్రంలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి నాటి నుంచి రక్తసేకరణ చేస్తున్నారు. ఇప్పటివరకు 1578 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసిన 1,07,815 యూనిట్ల రక్తం సేకరించారు. ఇప్పటివరకు 1,02,778 యూనిట్లు రక్తం అవసరమైన వారికి అందించారు. 2021లో అన్ని హంగులతో కూడిన బస్సును ఏర్పాటు చేసుకొని వసతులు లేని దూరప్రాంతాలకు వెళ్లి 63 రక్తదాన శిబిరాలను నిర్వహించి 2661 యూనిట్లు సేకరించారు. ఇటీవల కొత్తగా వచ్చి సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్ ద్వారా కూడా అత్యవసర రక్త సేకరణ చేస్తున్నారు.



రక్తదానం సామాజిక బాధ్యత..



నా పేరు సీహెచ్ రమణమూర్తి. నా వయసు 62 ఏళ్లు. మాది శ్రీకాకుళం. నేను స్టేట్ బ్యాంకులో పనిచేశాను. రక్తదానం ఓ సామాజిక బాధ్యత. అందుకే ప్రతి మూడు నెలలకు ఓ సారి రక్తదానం చేస్తుంటాను. మొదట్లో భయం వేసేది. అప్పట్లో మా మేనేజర్‌ను చూసి స్ఫూర్తి పొందాను. నాటి నుంచి ఇప్పటివరకు 65 సార్లు రక్తదానం చేశాను.

– సీహెచ్ రమణమూర్తి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, శ్రీకాకుళం

23 సార్లు రక్తదానం చేశా..



నేను మూడునెలలకోమారు రక్తదానం చేస్తుంటాను. ఇప్పటికి 23 సార్లు రక్తదానం చేశాను. 2014లో మా బాబాయి చనిపోయినపుడు రక్తం అవసరమైంది. అప్పటి పరిస్థితిని చూసి రక్తం ఇవ్వడం ద్వారా సామాజిక బాధ్యతగా భావించి ఇస్తున్నాను. నాది ఓ పాజిటివ్ గ్రూపు. ఎవరికైనా ఎప్పుడైనా కావాలంటే సిద్ధంగా ఉంటాను.

– డి.ఈశ్వర్‌కుమార్, కలెక్టరేట్ ఉద్యోగి, శ్రీకాకుళం

ఆదర్శంగా ఉండాలని



'స్పెషల్ గయ్స్ ఫౌండేషన్' వాట్సాప్ గ్రూపు ద్వారా ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలంటే నేనే ఆర్గనైజ్ చేస్తూ మా గ్రూపులో ఉండే సుమారు మూడు వేల మందికి అప్రమత్తం చేస్తాను. ప్రమాద పరిస్థితుల్లో దగ్గరలో ఉన్న వారు వెళ్లి రక్తం దానం చేస్తుంటారు. ఇప్పటికి నేను 17 సార్లు రక్తదానం చేశాను.

– దట్టి మహేష్, ఎస్‌జీఎఫ్ రక్తదాత ఆర్గనైజర్

అపోహలు మానండి



రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి. ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఆపద సమయంలో రక్తం ఎంతో అవసరం. దాన్ని గుర్తించండి. రక్తదానంపై అపోహలు మానండి.

– పి.జగన్మోహనరావు, చైర్మన్, రెడ్‌క్రాస్

27 సార్లు రక్తదానం



ఈ యువకుడి పేరు అనపాన శ్రీరామ్. ఇచ్ఛాపురం మండలం కొఠారీ గ్రామానికి చెందిన ఈ యువకుడు 2010 నుంచి రక్తదానం చేస్తున్నాడు. ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేసే శ్రీరామ్ తన 30 ఏళ్లలో 27 సార్లు రక్తదానం చేశాడు. కరోనా సమయంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించాడు.

అత్యవసర సమయాల్లో..



అటు శ్రీకాకుళం నుంచి ఇటు బరంపురం వరకు ఏ అత్యవసర సమయాల్లో ఫోన్ చేసినా క్షణాల్లో వెళ్లి రక్తదానం చేస్తుంటాను. ఐదేళ్లలో 15 సార్లు రక్తదానం చేశాను. అదే విధంగా గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ బ్లడ్ బ్యాంకులకు రక్తం దానం చేస్తుంటాం.

– బొండాడ రవి,పురుషోత్తపురం, ఇచ్ఛాపురం మండలం

రక్తదానంపై అవగాహన నేడు..

ఈ నెల 14న రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తదానంపై ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీలు, ఎక్కువ పర్యాయాలు రక్తదానం చేసిన దాతలకు సత్కారాలు అందించనున్నారు.



ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రమణమూర్తి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించినట్లు రామారావు తెలిపారు. – కవిటి

విద్యార్థులకు నైపుణ్యాలు తప్పనిసరి



మాట్లాడుతున్న మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ రంగారావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐటీఐ చదువుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ రంగారావు అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో (ఐటీఐ)లో గురువారం రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 14 మందిని ఎంపిక చేశారు. చివరి సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన తర్వాత వీరికి కంపెనీలో ఉద్యోగాలిస్తారు. ముందుగా విద్యార్థులకు ఉపాధిపై అవగాహన కల్పించారు. రెండేళ్ల ఐటీఐలో విద్యార్థులు పారిశ్రామిక నైపుణ్యాలు సాధించాలని అన్నారు. నిపుణులైన వర్కర్ల కొరత పరిశ్రమల్లో ఉందని, క్షేత్ర స్థాయిలో సమర్థంగా పని చేసే నైపుణ్యం, విషయ పరిజ్ఞానం రెండు అంశాలు కీలకమని చెప్పారు. జిల్లా ఉద్యోగ, ఉపాధి కల్పన అధికారి సుధ మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా నైపుణ్యాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ఇన్‌స్టిట్యూట్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు ఎంవీ మూర్తి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ



పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ రమణ

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై టెక్కలి డీఎల్‌పీఓ ఐవీ రమణ విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడు బి.నారాయణ మూర్తి, సర్పంచ్ శిర్ల వేణుకుమారి, ఈఓ టి.కూర్మారావు సమక్షంలో ఇరువురితో విచారణ చేపట్టారు. గతంలో నారాయణమూర్తి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై, చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని నారాయణమూర్తి తెలిపారు. అందులో భాగంగా గురువారం పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను డీఎల్‌పీఓ పరిశీలించారు. సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, దీలీప్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతితో విషాద ఛాయలు



ఆబోతుల లక్ష్మయ్య(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : విజయవాడలో బుధవారం జరిగిన సీఎం ప్రమాణ స్వీకార బందోబస్తు విధుల్లో పాల్గొన్న శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ (ఏఆర్ అటాచ్డ్) ఆబోతుల లక్ష్మయ్య (57) ఎండల వేడిమి తట్టుకోలేక స్ట్రోక్ వచ్చి గురువారం మృతి చెందారు. ఆయన ఆస్పత్రిలో ఉండగానే కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు అక్కడకు వెళ్లారు. లక్ష్మయ్యది జిల్లాలోని పోలాకి మండలం పల్లిపేట గ్రామం. ఈయనకు భార్య చంద్రకళావతి, ముగ్గురు కుమార్తెలు ఢిల్లీశ్వరి, రేణుక, భాగ్యరెడ్డి ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహాలు అయిపోయాయి. ఈయన కొంతకాలంగా అనారోగ్యం కారణంగా పెరాలిసిస్ మందులు వాడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈయన ఎచ్చెర్ల, శ్రీకాకుళం, జలుమూరు, నరసన్నపేట, కోటబొమ్మాళిలో పనిచేసి ఏఆర్ అటాచ్డ్‌గా రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. లక్ష్మయ్య మృతిపై సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణ, స్టేషన్ సిబ్బంది సానుభూతి తెలిపారు.

బాలుడు అదృశ్యం



బొంగు సాయికుమార్

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్ద మురహరిపురం గ్రామానికి చెందిన బొంగు సాయికుమార్ అదృశ్యమైనట్లు తండ్రి మోహనరావు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తండ్రి మోహనరావు తన భార్య సరస్వతితో గురువారం నందిగాం మండలం కొండపేట గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లి, మళ్లీ తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద తన కుమారుడు సాయికుమార్ లేకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో, గ్రామాల్లో వెతికారు. కుమార్తెను అడగ్గా తమ్ముడు పిన్ని వాళ్లింటికి వెళ్లాడని చెప్పడంతో, గ్రామంలోని మరదలు ఇంటికి వెళ్లి మోహనరావు వాకబు చేశాడు. మరదలు కూడా పిల్లాడు తన ఇంటికి రాలేదని చెప్పడంతో, మండలంలో బంధువుల ఇంటి వద్ద కూడా వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో చివరికి గురువారం సాయంత్రం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ ఎక్కడైనా కనబడితే 8179232243, 9866645096 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారు.

'లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. రానున్న లోక్‌అదాలత్‌పై గురువారం పోలీస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో న్యాయసదన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు లోక్‌అదాలత్ వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. చిన్న చిన్న వివాదాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించాలని అన్నారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జులై 27 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు ఆ కేసుల విషయంలో వర్చువల్ విధానం ద్వారా లేదా నేరుగా అదాలత్‌లో పాల్గొని పెండింగ్ కేసులు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. అందుకు గాను 15100 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఊరి పేర్లపై ఆకాశవాణిలో కొండలరావుతో ఇంటర్వ్యూ



వాండ్రంగి కొండలరావు ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం

పొందూరు: ప్రముఖ నామ విజ్ఞానవేత్త, పత్రికా రచయిత వాండ్రంగి కొండలరావుతో గురువారం ఆకాశవాణి అదిలాబాద్ కేంద్రం సంక్షిప్త ఇంటర్వ్యూ నిర్వహించింది. అనౌన్సర్ జి.జ్యోతి తన సుమధుర స్వరంతో జరిపిన ఈ ఇంటర్వ్యూ ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా కొండలరావు తాను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదువుతున్నప్పుడు ఆచార్య తూమాటి దొణప్ప, అలాగే అప్పట్లో గ్రామం నామ విజ్ఞానంపై పరిశోధన చేస్తున్న యార్లగడ్డ బాలగంగాధరరావు ప్రోత్సాహంతో ఈ రంగంలో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు ఊరు–పేరు(ఆంధ్రప్రదేశ్), గ్రామ నామాలు (ఆంధ్రప్రదేశ్) అనే రెండు ప్రామాణిక గ్రంథాలను రాసినట్టు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే తాను ఇంతవరకు వెయ్యి ఊరి పేర్లు, ఆ పేర్ల వెనుక గల నేపథ్యాన్ని రాసినట్టు వివరించారు. క్షేత్ర పర్యటనల ద్వారా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. 'గలగలలు అనే ఊరు అనంతపురం జిల్లా గుమ్మగట్టు మండలంలో ఉంది. ఇక్కడ ఆ రోజుల్లో గాజు వ్యాపారులు హెచ్చుగా ఉండేవారు. తయారీ యూనిట్లు నెలకొని ఉండేవి. గాజుల శబ్దం గలగలలే కదా. అంచేత నాటి పెద్దలు ఈ పల్లెలకు గలగలలు అనే అందమైన పేరు పెట్టారు.' అని వివరించారు. మరో ఊరు పేరు పాలసముద్రం. ఇది చిత్తూరు జిల్లాలోని మండల కేంద్రం అంటూ.. ఈ ఊరి పేరు వెనుక గల చరిత్రను విపులీకరించారు. ఆ రోజుల్లో ఇక్కడ పాడి పరిశ్రమ బాగా వర్ధిల్లడంతో ఊరికి పాలసముద్రం అనే పేరును నాటి కార్వేటినగరం సంస్థానాధీశులు పెట్టారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



సంఘటన స్థలంలో గాయాలతో సాయిజెన్న

మెళియాపుట్టి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులతో పాసైన విద్యార్థిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలి తీసుకుంది. మండలంలోని పద్మ గ్రామానికి చెందిన సాయి జెన్న (15) గురువారం జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 22వ తేదీన పద్మ గ్రామంలో జరిగిన గ్రామదేవత ఉత్సవాలకు సాయి మామయ్య తన కుటుంబంతో కలిసి వచ్చాడు. గురువారం తిరుగు ప్రయాణంలో ఆటోలో వారందరూ పలాస రైల్వే స్టేషన్‌కు బయల్దేరారు. వారిని దిగబెట్టడానికి సాయి కూడా ఆటో ఎక్కాడు. తూముకొండ గ్రామ సమీపంలో ఆకులమ్మ వారి గుడి సమీపంలోని మలుపులో పట్టుపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మలుపు కావడంతో ఒక్కసారిగా ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో సాయి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే సాయి జెన్న మృతి చెందినట్లు వైద్యులు పావని నిర్ధారించారు. మృతుడు చాపర పాఠశాలలో పదో తరగతి చదివి పాసయ్యాడు. తల్లిదండ్రులు జమున, బొల్లాబొ, సోదరుడు తపన్ జెన్నా ఉన్నారు. పిల్లాడు చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

WANTED
స్వీట్ షాప్‌లో పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. సంప్ర. 7997553737
స్వీట్స్ డెలివరీ కొరకు ఆటో డ్రైవర్ కావలెను. సంప్ర. 9440195502
పనిచేయు ప్రదేశం
రాజధాని స్వీట్స్
కిన్నెర థియేటర్ దగ్గర, ZP రోడ్, శ్రీకాకుళం

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER
■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషీన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

WANTED
■ శ్రీకాకుళం టౌన్, A.P.H.B. కాలనీ, హాస్టల్‌లో పనిచేయుటకు మేడ్స్–B.Sc.B.Ed, ANM-నర్సింగ్ చేసి వుండాలి, కంప్యూటర్ ఆపరేటర్–M.S.Office కావలెను. (మహిళలకు మాత్రమే) సెల్. 8522818225 [S-793951]
■ లాడ్జిలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, రూమ్ బోయ్స్ & బట్టల షాపులో పనిచేయుటకు సేల్స్‌మేన్స్, హెల్పర్స్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత సం।।ప్ర సెల్: 9440710617 [S-793952]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185209]
■ కష్టలెస్సే కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD.7995984445 [HA-228]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కడలి కల్లోలం



అక్కుపల్లి తీరంలో ఎగసిపడుతున్న అలలు

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కుపల్లి శివసాగర్ తీరంలో గురువారం సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తీరానికి వచ్చిన పర్యటకులు భయాందోళన చెందారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో శీతలషష్టి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పాటుచేసిన భరతనాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. ఇచ్ఛాపురానికి చెందిన వేంకటేశ్వర నృత్యబృందం ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శనల్లో పలు సినీసంగీత గీతాలకు అద్భుతమైన నృత్యరీతులతో తమ నృత్యభంగిమలతో చూపరుల్ని ఆకట్టుకున్నారు.



శ్రీమహావిష్ణువు అవతారాన్ని వివరించే నృత్యరూపకం